# ఆరంభం

"మనిద్దరం విడిపోయే సమయం దగ్గర పడుతోంది" దిగాలుగా అన్నాడు బాబు.

"లేకపోతే ఇలా ఒద్దికగా సర్దుకొని ఎన్నాళ్ళని వుండగలం? అవతల విశాల ప్రపంచం మనకు స్వాగతం పలుకుతోంటే!" పాప అనునయంగా అంది.

"నీవేమయినా చెప్పు. ఇన్నాళ్ళూ అమ్మలో వెచ్చగా, హాయిగా కాలం గడిపాం. కొత్త పరిసరాలలోకి వెళ్ళి ఎలా ఇమడగలం?" అన్నాడు బాబు.

"అమ్మలోంచి అమ్మ ఒడిలోకి మారుతాం, అంతేగా తేడా!"

"అది నీవనుకొంటున్నంత సులభం కాదనిపిస్తుంది." బాబు తన ధోరణిలో తానన్నాడు. "నీవు నన్ను ఒంటరి వాణ్ణి చేయవుగా! ఎప్పటికీ నాతో స్నేహం మానేయవుగా!"

"అలాగని జుట్టంతా పీక్కొని మరీ ఆలోచిస్తున్నావా?"

"నీది ఉంగరాల జుట్టని నా గుండుని వెక్కిరించవద్దులే!" ఉక్రోషంగా అన్నాడు బాబు.

"నేనేమన్నానూ? చలిమిడి ముద్దలా ముద్దొస్తున్నావు...అన్నాను. అంతేగా! అయినా నీతో ఎవరయినా ఇట్టే స్నేహం చేస్తారులే", పాప చిరునవ్వుతో అంది.

" ఎవరు ఎలా పోయినా నీవు మాత్రం నా తోడు వదలవుగా!" బాబు మళ్ళీ అనుమానంగా అడిగాడు.

" ఊహు".

" ఒకే కణంలోంచి ఒకే క్షణంలో జీవం పోసుకున్నాం. ఒకే ప్రాణంలా ఈ తొమ్మిది నెలలు అమ్మలో ఒదిగి పెరిగాం మనం అడుగుపెట్టబోతున్న కొత్త లోకంలో కూడా ఒకే జట్టుగా జీవిద్దాం. ఏమంటావ్?"

"తప్పకుండా!" పాప కంఠం స్థిరంగా పలికింది.

అమ్మలోంచి బయటకు రావడం ఈ లోకంలో కళ్ళు తెరవడం ఇద్దరి ప్రమేయం లేకుండానే జరిగిపోయాయి.

వెచ్చని నీళ్ళల్లో స్నానం చేయించి, మెత్తటి బట్టలు తొడిగి, ఉయ్యాలలో పక్క పక్కన పడుకోబెట్టి వెళ్ళిందో ఆవిడ. బాబు బెంగగా పాప వంక చూసాడు. పాప స్నేహపూర్వకంగా నవ్వింది.

బాబు నిశ్చింతగా కళ్ళు మూసుకుని పడుకున్నాడు.

'' ఇప్పుడెలా వుంది..'' ఎప్పుడూ గంభీరంగా వినిపించే గొంతు మృదువుగా పలికింది. ఆ గొంతు నాన్నది.

''నాకు తేలికగానే వుంది. పిల్లలెలా వున్నారు?'' అమ్మ ఆత్రంగా అడిగింది.

నాన్న నెమ్మదిగా ఉయ్యాల దగ్గరికి వచ్చాడు.

బాబు అతనికేసి వంక అనుమానంగా చూసి, మరింత దగ్గరగా ముడుచుకున్నాడు. పాప నాన్నను పలకరిస్తున్నట్లుగా నవ్వింది.

''నా మనవడెలా వున్నాడో ముందు నన్ను చూడనివ్వండిరా'' ఒకావిడ గట్టి గట్టిగా మాట్లాడుతూ ఉయ్యాల దగ్గరకు వచ్చింది.

''రా అమ్మా.. నువ్వే చూడు.''

నాన్న నవ్వుతూ వెనక్కి జరిగాడు.

ఆవిడ బాబుని గబుక్కున చేతిలోకి తీసుకొని మొహమంతా ముద్దులతో నింపేసింది. ఆవిడ గబగబ అమ్మమంచం దగ్గరికి వెళ్ళింది. నాన్న ఆవిడ వెనకే వెళ్ళాడు.

''చూడు, వీడంతా వాళ్ళ తాత పోలికే! బంగారు కొండ! చిట్టి తండ్రి.'' ఆవిడ మురిపెంగా అంది.

అమ్మ, నాన్న సన్నగా నవ్విన సవ్వడి వినిపించింది.

''కంగ్రాచ్యులేషన్స్ అన్నయ్యా, ఏడీ నీ వంశోద్ధారకుడు!'' అంటూ ఓ యువతి అంతకన్నా హడావుడిగా వచ్చింది.

''రావే అమ్మాయి రా,అంతా మీ నాన్నలా లేడూ వీడు! బాబుకి పేరు ఆయనదే పెడితే బావుంటుంది కదూ!''

''అలాగేలా అమ్మా'' నాన్న నవ్వుతూ అంటున్నాడు.

బాబు కొత్త వ్యక్తుల్ని బిత్తరపోయి చూస్తున్నాడు.

పాప ఉయ్యాలలోంచి తనను కూడా ఎవరైనా ఎత్తుకొని వెళతారేమోనని ఆత్రంగా చూస్తోంది.

ఎవరి హడావుడిలో వాళ్ళున్నారు. పాప కళ్ళు తెరచి వారందరి వైపు చూసింది.

అమ్మబాబును పొదివి పట్టుకుని వుంది. అందరూ ఆమెచుట్టూ చేరి సంబరంగా, హడావుడిగా మాట్లాడుకుంటున్నారు.

తన ప్రస్తావన వారి సంభాషణలో దొర్లుతుందేమోనని పాప చెవులురిక్కించి, జాగ్రత్తగా వారి మాటలువింది.

మళ్ళీ నిరాశే ఎదురయింది.

పాపకు తనవారిలో తన గుర్తింపు కోసం ఆరాటం పెరిగింది.

పిడికిళ్ళు బిగించి, కళ్ళు గట్టిగా మూసుకుని, నోరంతా తెరిచి, బిగ్గరగా అరిచింది. అందరూ ఒక్కసారిగా మాటలాపి, ఉయ్యాలవంక చూసారు.

యువతి ఉయ్యాల వద్దకు వచ్చింది. ''అమ్మా..చూడవే! పాపది ఎంత చక్కటి ఉంగరాల జుట్టో!'' ఉత్సాహంగా అరిచింది.

పాపలో మళ్ళీ సంతోషం చిగురించింది.

'' ఆ...! ఆడపిల్లకి ఏం వుండి ఏం లాభం! మనల్నందర్నీదోచి, ఎక్కడికో పోయి బతికేదేగా! అదే మన బంగారు తండ్రి అయితేనా..!'' పెద్దావిడ దీర్ఘాలు తీసింది. బాబుకి మెటికలు విరిచి, ముద్దాడింది.

ఆ యువతి ఏమనుకుందో ఏమో మౌనంగా వెనక్కు వెళ్ళింది.

పాప మళ్ళీ ఒంటరిదయింది. బాబును చూడాలని ప్రయత్నించింది. బాబులో మునుపటి అనుమానాలు, భయాలు పోయినట్లున్నాయి. నిశ్చింతగా నవ్వుతున్నాడు.

పాప అమ్మదృష్టిని ఆకర్షించాలని మరోసారి ప్రయత్నించింది.

''అబ్బబ్బా, ఒకటే గోల! ఏం పిల్లో ఏమో బాబూ! కాసేపు అలా ప్రశాంతంగా కూర్చోనివ్వట్లేదు!'' పెద్దావిడ విసుక్కుంది.

''పాపకి ఆకలయ్యిందేమో అత్తయ్యా!''అమ్మ నెమ్మదిగా అంది.

అమ్మగొంతులోని ఆర్ద్రత పాపను శాంతింపజేసింది. అమ్మ ఒడి చేరేందుకు ఆత్రంగా గాలిలోకి కాళ్ళూ చేతులూ విసురుతూ, కేరింతలు కొట్టింది.

''దాని సంగతి నేమాస్తాలే! నీవు కదలమాక! నీవు బుజ్జి కన్నని జాగ్రత్తగా చూసుకో! అసలే వీడు పాప కన్నా కాస్త బరువు తక్కువని డాక్టరమ్మ

చెప్పలేదూ!'' పెద్దావిడ బాబును అమ్మకు అందించి, విసవిసా నడుస్తూ ఉయ్యాల దగ్గరకి వచ్చింది.

పాపకు తన సంతోషం సంబరం పెద్దావిడ అందించిన సీసా పాలలో కరిగిపోయినట్లనిపించింది. తనచుట్టూ వున్న కొత్త ప్రపంచం గత తొమ్మిది నెలలుగా తానున్న లోకం కన్నా చిన్నదిగా, చీకటిగా వున్నట్లు తోచింది.

ఇన్నాళ్ళూ బాబుతో కలిసి నిర్మించుకున్న ఊహా చిత్రం ఓ కలలా కరిగి పోయింది.

పాపకు బాబు మాటలు జ్ఞాపకం వచ్చాయి. బాబు వైపు ఉత్కంఠగా చూసింది.

అమ్మ ఒడిలో అమృతం రుచి చూసిన బాబు పాపను చూసి గర్వంగా కనుబొమలెగరేసి, చిద్విలాసంగా నవ్వి నట్లనిపించింది.

చివరకు బాబు కూడా...!

ఏదో తెలీని ఉద్వేగం పాపను అవహించింది.

మరోమారు పాప పిడికిళ్ళు గట్టిగా బిగుసుకున్నాయి.

వనిత మే 1994